క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ అందజేత



వత్సవాయి: మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన దారెల్లి చిరంజీవి ఆటో డ్రైవర్లకు ఆదివారం యూనిఫామ్‌ను అందజేశారు. కొందరు డ్రైవర్లు యూనిఫామ్ కావాలని కోరగా ఆయన స్పందించారు. వత్సవాయి, పోలంపల్లి, దబ్బాకుపల్లి గ్రామాలకు చెందిన మొత్తం 60 మంది ఆటో డ్రైవర్లకు తన సొంత ఖర్చులతో యూనిఫామ్‌ను అందించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండి వారిని క్షేమంగా గమ్యానికి చేర్చాలన్నారు. అనంతరం డ్రైవర్లు చిరంజీవిని శాలువాతో సత్కరించారు.

గోవుల సంరక్షణకు వితరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణ నిమిత్తం ఆదివారం హైదరాబాద్, నిజాంపేట ప్రాంతానికి చెందిన కేవీఎస్ రమేష్ కుమార్తె మోహన లహరి రూ.58,116లను ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

అమ్మవారికి శాకంబరి అలంకరణ



నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా భక్తుల సహకారంతో పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి కుంకుమార్చన, సహస్ర నామ పూజలు చేశారు. ఆలయ ఈవో నరసింహమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

30 వాహనాలకు రూ.7 వేల జరిమానా



కంచికచర్ల: వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వాహనం నడిపే సమయంలో అందుబాటులో ఉంచుకోవాలని ఎస్ఐ బోనగిరి రాజు అన్నారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో ఆదివారం వాహనాలను తనిఖీలు చేశారు. ఈమేరకు ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపరాదని మితిమీరిన వేగంతో ప్రయాణం చేయరాదని, విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే ప్రమాదం ముంచుకొస్తుందన్నారు. బైక్‌లు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. సరైన పత్రాలు అందుబాటులో లేని 30 వాహనాలను గుర్తించి రూ.7 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేనతకొండ గ్రామాభివృద్ధికి ఆరేళ్ల పాటు సహకారం అందించి బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులను సర్పంచి ఆశాలత ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సచివాలయ ఉద్యోగులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, మాజీ సర్పంచి పత్రి లేపాక్షిరావు, మాజీ ఎంపీటీసీలు సంజీవరావు, పుల్లారావు, గోపాలరావు, ముత్యార్ మియా, పులి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వీరంకికి సామాజిక సేవా పురస్కారం

జి.కొండూరు: మండల పరిధి కోడూరు గ్రామానికి చెందిన రంగస్థల, సినీ నటుడు వీరంకి వెంకట నరసింహారావుకు రితిక ఫౌండేషన్ వారి సామాజిక సేవా పురస్కారం లభించింది. విజయవాడలోని ఆర్మీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సినీ నటి జగదేశ్వరి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకట నరసింహారావు మాట్లాడుతూ దశాబ్దాలుగా కళారంగానికి చేసిన సేవలకు గాను అవార్డు లభించిందని ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు నిత్యాచారి పాల్గొన్నారు.

మాట తప్పడం చంద్రబాబుకు అలవాటే



సమావేశంలో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న తన్నీరు, ఇతర నాయకులు

- వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట సమన్వయకర్త తన్నీరు
- వత్సవాయిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

వత్సవాయి: మాట ఇచ్చి తప్పడం చంద్రబాబునాయుడు నైజమని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం వత్సవాయిలోని శ్రీ వాసవీ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని తీరా అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించి కక్షపూరిత రాజకీయాలకు తెరలేపారన్నారు. అక్రమ కేసులను బనాయించి, అక్రమ అరెస్టులు చేసి వైఎస్సార్ సీపీ నాయకులను బెదిరించాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. పట్టపగలు నడిరోడ్డుపై టీడీపీ, జనసేన మూకలు బీసీ మహిళ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతలను అసభ్య పదజాలంతో దూషించడం వారి దౌర్జన్యాలకు పరాకాష్టకు నిదర్శనమన్నారు. మహిళల పట్ల నాకు అపారమైన ప్రేమ ఉందని చెప్పుకునే డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాత్రం బీసీ మహిళపై జరిగిన దాడిని ఖండించకపోవడం విడ్డూరమన్నారు. రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి భంగపాటు తప్పదని హెచ్చరించారు. 15 రోజులలో గ్రామ పార్టీ అధ్యక్షుల ఎంపికను పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం నాయకులు క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, జిల్లా, నియోజకవర్గ, మండల రైతు విభాగం అధ్యక్షులు ఏలూరి శివాజీ, కనగాల రమేష్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు నంబూరి రవి, చింతకుంట్ల వెంకటరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, నాగేంద్రరెడ్డి, రూప్లానాయక్, పెంటి శ్రీనివాస్, నరమేనేని వెంకటేష్, ఎం.నరేష్, బాజీ, బత్తుల రామారావు, ఫిరోజ్‌ఖాన్, కాటేపల్లి రవి, కొలికపోగు వెంకటేశ్వర్లు, కొట్టె నగేష్ పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం

- ప్రశ్నిస్తున్నాం అనే భయంతోనే ఈ అక్రమ కేసులు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు



జగ్గయ్యపేట అర్బన్: ఇచ్చిన హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన అధికారాన్ని ప్రతిపక్షాల మీద కక్ష తీర్చుకోవడానికి వాడుతున్నారని, అసలు జరగని మద్యం కుంభకోణాన్ని జరిగినట్లు చూపించి అక్రమ అరెస్టులు చేస్తున్నారని, ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మిథున్‌రెడ్డి అరెస్ట్ కక్షతో కూడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మద్యం కుంభకోణం పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సాధారణ వ్యక్తికి సైతం రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఎవరు ప్రశ్నిస్తే వారి గొంతు నొక్కేస్తాం, తప్పుడు కేసులు పెడతాం, జైలుకు పంపిస్తామనే విధంగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఆయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు అన్న కారణంతోనే వారిని రాజకీయంగా కుంగదీయాలనే కక్షతోనే మిథున్‌రెడ్డిని కేసులో ఇరికించారన్నారు. కూటమి ఏడాది పాలనలో మీరిచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తుంటే దీన్ని డైవర్ట్ చేయడం కోసం అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు.

ఈ అక్రమ అరెస్టులకు బయపడేవారు ఎవరూ లేరని, ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎందరు గొంతులు నొక్కినా బంతిని గోడకు కొట్టిన రీతిలో అంతే వేగంతో తిరిగి వైఎస్సార్ సీపీ శ్రేణులు ముందుకు వస్తారని తెలిపారు. నిరపరాధిని అక్రమ కేసులో ఇరికించినందుకు తగిన మూల్యం మీరు చెల్లించుకుంటారన్నారు. దీనిని పార్టీ శ్రేణులంతా ఖండిస్తున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరచి తప్పుడు కేసులపై పునరాలోచించుకోవాలని హితవు పలికారు.

వర్షం.. రోడ్లు జలమయం



కంచికచర్ల దుర్గగుడి రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



వసంతకాలనీలో చిన్నపాటి వర్షానికే జలమయమైన రోడ్డు

కంచికచర్ల: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపునీరు నిలబడింది. వసంతకాలనీ, దుర్గగుడి రోడ్, హనుమాన్‌పేటలోని విజయరాణి స్కూల్ రోడ్డు, గొట్టుముక్కల, జుజ్జూరు రోడ్లన్నీ జలమయంగా మారాయి. అయితే ఈ వర్షం మాత్రం పంటలకు దాహం తీర్చినట్లుగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి వర్షాలు కురవాలని రైతులు కోరుతున్నారు. అప్పుడే సాగు సజావుగా జరిగి పంట దిగుబడులు వస్తాయని అంటున్నారు.

'బుద్ధునితో నా ప్రయాణం' కరపత్రాల ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న బీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉపాస్క హరిబాబు, తదితరులు

కంచికచర్ల: స్థానిక ఏపీఎన్జీవోస్ కార్యాలయంలో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ముందుగా అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'బుద్ధునితో నా ప్రయాణం' అనే కరపత్రాన్ని మిక్ ఇంజినీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథి ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్ష్యుడు ఉపాస్క హరిబాబు నేటి సమాజానికి బౌద్ధం ఆవశ్యకను వివరించారు. ఈ నెల 22న విజయవాడలోని మొగల్రాజపురం సమీపంలో సిద్ధార్థ ఆడిటోరియంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సమర్పించిన 'బుద్ధునితో నా ప్రయాణం' అనే అంబేద్కర్ నాటకాన్ని తిలకిస్తే పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీఐ జాతీయ కార్యదర్శి కొండలరావు, జిల్లా కమిటీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు కర్ల రవి కుమార్, స్వామి దాసు పుల్లారావు, బూరుగ వర్మ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ



ఐతవరంలో ముత్యాలమ్మకు బోనాలు సమర్పించేందుకు వస్తున్న మహిళలు



వెల్లంకిలో బోనాలు సమర్పిస్తున్న గ్రామస్తులు

నందిగామ రూరల్: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో గ్రామం కళకళలాడాలని కోరుతూ గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో ఆదివారం బోనాలు సమర్పించారు. మండలంలోని ఐతవరం గ్రామంలో మహిళలు పెద్ద సంఖ్యలో మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ అమ్మవారు, ఆంజనేయ స్వామి, రామాలయం, నాభిశిలకు బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ బోనాలు సమర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో బోనాల సమర్పణ

వీరులపాడు: మండలంలోని వెల్లంకి గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారు, నాభిశిల, జంటలమ్మ అమ్మవారి ఆలయాలలో ప్రజలు ఆదివారం పండుగ వాతావరణంలో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని కోరుతూ ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేకంగా ప్రభలు తయారు చేసి ఊరేగింపుగా ఆయా ఆలయాలకు తరలివచ్చి వరదపాశం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. ముందుగా ఆయా ఆలయాలలో అమ్మవార్లను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరి, నాయకులు వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, చంద్ర సురేష్, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముక్త్యాల లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ. 489.28 కోట్లు, పేట పట్టణంలోని ఎర్రకాలువ ప్రక్షాళనకు రూ.5.65 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఎర్రకాలువ శాంతినగర్ నుంచి ఊర చెరువు వరకు లైనింగ్ పనులు, కల్వర్టుల ఏర్పాటు ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వ, మురుగు ప్రవాహాల సమస్యలు తొలగిపోతాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు, నీటి సంఘాల నాయకులు ఏలూరి గోపాలరావు, చిట్టూరి సుభాష్, నారాయణరావు, గాలం కృష్ణ, కర్ల నాగేశ్వరరావు, యలమందల నరసింహారావు, షేక్ మాబూ హుస్సేన్, కౌన్సిలర్లు రామలక్ష్మీ,సైదేశ్వరరావు, వెంకట్ పాల్గొన్నారు.

రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్

నందిగామ రూరల్: రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర చరిత్ర కలిగిన వారు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఘర్షణలు, వివాదాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా సహించేది లేదన్నారు. నేర జీవితాన్ని విడనాడి కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవనం సాగించాలని సూచించారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని చెప్పారు. అనంతరం నేరాలకు పాల్పడబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు పాల్గొన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 27న ద్వారావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి బొక్కా రాజు ఆదివారం తెలిపారు. ఈ శిబిరంలో ఈసీజీ, ఎకో, కంటి పరీక్షలు, షుగర్, బీపీ, ఎముకలు, వంటి సమస్యలపై ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో వియవాడ మెడ్‌స్టార్, హాసిని గ్యాస్ట్రో హాస్పటల్, కృష్ణ సోమ్‌సియరామ్, శ్రేయస్ ఆర్థో మల్టీ సూపర్ స్పెషాలిటి, అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు వివిధ వైద్య పరీక్షలు చేస్తారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజు కోరారు.

నాసిరకంగా ఊరచెరువు అభివృద్ధి పనులు

సీపీఐ పట్టణ ప్రధాన కార్యదర్శి జూనెబోయిన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఊర చెరువు అభివృద్ధి పనులు నాసిరకంగా చేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాస్తవానికి పనికి అయిన ఖర్చు సగంలోపే అని, రాజ మార్గం ద్వారా టెండర్‌దారునికి రెడ్ కార్పెట్ పరిచి దోచి పెడుతున్నారని సీపీఐ పట్టణ ప్రధాన కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణం మధ్యలో ఉన్న ఊర చెరువు కింద సుమారు 304 ఎకరాల ఆయకట్టు సాగు అవుతుందని తెలిపారు. చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వివిధ ఫండ్స్ ద్వారా సుమారు రూ.5 కోట్ల పనులను టెండర్‌దారునికి అప్పగించారన్నారు. ఈ పనులు నాసిరకంతో, అవగాహన రాహిత్యం వలన అసంపూర్తిగా చేశారని తెలిపారు. దీని వలన చెరువు పరిసర ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న వర్షానికి సైతం చెరువు గోడ వెంబడి నీరు నిల్వ ఉండం, పూర్తిస్థాయిలో నిర్మించని చెరువు గట్టు వలన దాని అంచులతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చెరువు వద్ద చెట్లు పూర్తిస్థాయిలో పెంచడంలేదని, స్ట్రీట్ లైట్లు కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇంతపెద్ద అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపం కనపడుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు టెండర్‌దారునితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేడు బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ

కంచికచర్ల: పట్టణంలో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కూటమిని నమ్మిన ప్రజలకు
మోసమే మిగిలింది

- మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- చందర్లపాడులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ



చందర్లపాడులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చందర్లపాడులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

చందర్లపాడు(నందిగామ టౌన్): ఎన్నికలకు ముందు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కన్నా ఎక్కువ పథకాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత పథకాల ఊసెత్తటం లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ మండల స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతల మాటలు నమ్మి ఓట్లేసి అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలకు మోసమే మిగిలిందన్నారు.

మేనిఫెస్టోను విస్మరించిన కూటమి ప్రభుత్వం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మేనిఫెస్టోను బైబిలు, ఖురాన్, భగవద్గీతగా భావించి ప్రతి ఒక్క పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని జగన్‌మోహనరావు గుర్తు చేశారు. కానీ ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన మేనిఫెస్టోను అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు చెత్తబుట్టలో వేశారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా పథకాలన్నీ అమలు చేశాం, ఉద్యోగాలు కల్పించామని చెబుతున్న కూటమి నేతలను ప్రజలు ప్రశ్నించాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జగన్‌మోహన్‌రావు పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ పథకాలు, ప్రభుత్వ అసమర్ధ పనితీరును ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, నాయకులు శాఖమూరు వెంకట కుమారి, బుగ్గినేని సురేష్, చింతోటి ప్రసాద్, గుడేటి శ్రీను, జానీ, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల కోలాహలం



నిమ్మకాయ పూజ చేయించుకుంటున్న భక్తులు



సారె తెస్తున్న సర్పంచ్ లావణ్య, భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు ఆషాఢ మాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

అమ్మవారికి సారె సమర్పణ

పెనుగంచిప్రోలు: ఆషాఢ మాసం సందర్భంగా గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారికి శనివారం మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన భక్తులు సారె సమర్పించి బోనాలు చెల్లించారు. అమ్మవారికి సారె సమర్పణ అనంతరం వారికి వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గూడపాటి లావణ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఉప సర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రవి కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మల్లికార్జునరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ రూరల్: పట్టణ పరిధిలోని అనాసాగరానికి చెందిన చాపల మల్లికార్జునరావు సతీమణి నవదుర్గ ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈ నెల 14న తెల్లవారుజామున ప్రమాదం జరగ్గా అప్పటి నుంచి విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించి మృతి చెందారు. నవదుర్గ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నవదుర్గ భర్త మల్లికార్జునరావు, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, నాయకులు పాములపాటి రమేష్, కరి రవీంద్ర, వడ్డెల్లి శ్రీను, షేక్ మున్నా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి ఉత్తర్వులు

నందిగామ రూరల్: మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న సంగమేశ్వర స్వామి వారి ఆలయం ధర్మకర్తల నియామకానికి దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆలయ ఈవో నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ నియామకానికి ఉత్తర్వులు వచ్చాయని ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రకటన

నా క్లయింటు **M/s. Shriram Finance Ltd.**, జగ్గయ్యపేట బ్రాంచ్ వారి సంజాయిషీ తెలియజేయునది ఏమనగా **మల్లాది లక్ష్మీవరణ్** S/o. మల్లాది కోటేశ్వరరావు, ఎన్.టి.ఆర్. జిల్లా, వత్సవాయి మండలం, మక్కపేట గ్రామానికి చెందిన వారి యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని తనఖా పెట్టుకొని వారి తల్లిగారైన **మల్లాది ఉమామహేశ్వరి** గారికి ఋణము మంజూరు చేయదలచినారు.కాబట్టి ఈ ఆస్తిపై ఎవరికైనను ఎట్టి హక్కులు గానీ, అభ్యంతరములు గానీ, క్రయములు గాని ఉన్న యెడల ఈ క్రింది చిరునామాకు 7 రోజుల లోగా తగు సాక్ష్యాధారాలతో రిజిష్టర్ పోస్ట్ విత్ Ack Due ద్వారా తెలియపరచగలరు. లేని యెడల ఆస్తిపై వచ్చు అభ్యంతరములను ఈ ఆస్తి నిర్వివాదమైనదిగా భావించి ఋణము మంజూరు చేయగలవారము. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు అని యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా, జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, వత్సవాయి మండలం, మక్కపేట గ్రామంలోని R.S.No. 208-4B1A, డాక్యుమెంట్ నెం. 1924/2025 లోని 726 చ॥గ॥ స్థలానికి హద్దులు. **తూర్పు:** మల్లాది వెంకట్రామయ్య గారి భూమి, **దక్షిణం :** డొంక, **పడమర :** ఆళ్ళూరు వెంకట్రామమ్మ గారి భూమి, **ఉత్తరం :** నా తాలూకా మిగిలిన భూమి.

జగ్గయ్యపేట
తేది: 20-7-2025
రాయపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12820.

ప్రకటన

నా క్లయింటు **M/s. Shriram Finance Ltd.**, జగ్గయ్యపేట బ్రాంచ్ వారి సంజాయిషీ తెలియజేయునది ఏమనగా **నీలం రత్నం** W/o. **నీలం సత్యనారాయణ**, ఎన్.టి.ఆర్. జిల్లా, జగ్గయ్యపేట మండలం, షేర్ మహ్మద్‌పేట (డోర్ నెం. 1-64) గ్రామానికి చెందిన వారి యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని తనఖా పెట్టుకొని వారి కొడుకు అయిన **నీలం వెంకటేశ్వర్లు** గారికి ఋణము మంజూరు చేయదలచినారు.కాబట్టి ఈ ఆస్తిపై ఎవరికైనను ఎట్టి హక్కులు గానీ, అభ్యంతరములు గానీ, క్రయములు గానీ ఉన్న యెడల ఈ క్రింది చిరునామాకు 7 రోజుల లోగా తగు సాక్ష్యాధారాలతో రిజిష్టర్ పోస్ట్ విత్ Ack Due ద్వారా తెలియపరచగలరు. లేని యెడల ఆస్తిపై వచ్చు అభ్యంతరములను ఈ ఆస్తి నిర్వివాదమైనదిగా భావించి ఋణము మంజూరు చేయగలవారము. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు అని యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా, జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, జగ్గయ్యపేట మండలం, షేర్ మహ్మద్‌పేట గ్రామంలోని R.S.No. 91-1, డాక్యుమెంట్ నెం. 3320/2023 లోని 182.30 చ॥గ॥ స్థలానికి హద్దులు. **తూర్పు:** అ. 30.3లు ఏరెడి సరస్వతి గారి భూమి, **దక్షిణం :** అ॥ 54.9లు ప్లాట్ నెం. 34 తాలూకా స్థలం, **పడమర :** అ. 30.3లు అ 24లు వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం :** అ. 53-4లు ప్లాట్ నెం. 32 దాఖలా స్థలం. ఈ హద్దుల మధ్య భాగమైన స్థలం.

జగ్గయ్యపేట
తేది: 20-7-2025
రాయపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12820.